క్లుప్తంగా

యాదాద్రీశుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లకు సువర్ణ పుష్పార్చన పూజలు చేశారు.

రోడ్లకు మరమ్మతులు



కేసముద్రం: మండల కేంద్రంలో ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంతలమయంగా మారిన రోడ్లపై మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు, లయన్స్‌క్లబ్ కేసముద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మొరం పోసి మరమ్మతు పనులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్సైలు కృష్ణమూర్తి, సుధాకర్, పాస్ట్ జెడ్సీ చందాగోపి, దాసరి అశోక్, యాకుబ్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

చిన్నగూడూరు: విద్యార్థులందరూ నూతన చట్టాలు, సైబర్ నేరాలు వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఝాన్సీ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సై ఝాన్సీ, షీ టీం ఎస్సై సునంద విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అగ్నిమాపక కేంద్రం సందర్శన



మహబూబాబాద్ అర్బన్/మహబూబాబాద్: విద్యార్థులు అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉంటే చుట్టు పక్కల జరిగే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని ఏకశిల హోలీ ఏంజిల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని శుక్రవారం పాఠశాల విద్యార్థులు సందర్శించారు.

మండల కమిటీ ఎన్నిక

తొర్రూరు: టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఏ.మురళీకృష్ణ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా కొండ నాగమల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎండి రఫీ.ఉపాధ్యక్షుడిగా మల్లయ్య, చైతన్య, కోశాధికారిగా యాకేందర్, కార్యదర్శులుగా వనజ, శంకర్, రాయలు, పర్వీన్ బేగం, శైలజ ఎన్నికయ్యారు.

సాహు మహరాజ్‌కు నివాళి

మహబూబాబాద్ అర్బన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను ఇవ్వాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో రిజర్వేషన్ల దినోత్సవం పురస్కరించుకొని చత్రపతి సాహు మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇస్సంపెల్లి ఉపేందర్, విజయ్‌కాంత్, ఎడ్ల శ్రీను, బుచ్చిరాములు పాల్గొన్నారు.

ప్రమోద్‌కుమార్‌కు డాక్టరేట్



బయ్యారం: బయ్యారానికి చెందిన ఉమ్మగాని ప్రమోద్‌కుమార్ వృక్షశాస్త్రములో చేసిన పరిశోధనకు గాను ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బీయూ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించి గౌరవ డాక్టరేట్ పొందాడు.

కేసులు ఎత్తివేయాలి

నెహ్రూసెంటర్: ఆర్టీసీ పరిరక్షణ కోసం జరిగిన ఉద్యమంలో వామపక్ష నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. ఆర్టీసీని పరిరక్షించాలంటూ 50 రోజుల సమ్మెలో భాగంగా శుక్రవారం వామపక్ష నేతలు కోర్టులు హాజరయ్యారు. కార్యక్రమంలో అజయ్‌సారధిరెడ్డి, నవీన్, వెంకన్న, సాంబలక్ష్మీ, రాజమౌళి, శ్రావణ్ పాల్గొన్నారు.

రేపు సన్మాన సభ

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర ఎస్టీ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియామకమైన తేజావత్ బెల్లయ్యానాయక్ సన్మాన సభ జిల్లా కేంద్రంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామివారి దేవాలయ ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నామని టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్ శుక్రవారం తెలిపాడు. ఈ సమావేశంలో పట్టణ ఓబీసీ అధ్యక్షుడు లింగాల వీరభద్రం గౌడ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవినాయక్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు సీతారాములు, శివయాదవ్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా జనరేటర్లు..!

- ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పని ఇబ్బందులు
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న స్థానికులు

తొర్రూరు: నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం అందజేసిన జనరేటర్లు నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలు వృథా అవుతుండగా ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు. సిబ్బంది కార్యకలాపాల నిర్వహణ కోసం ఇంతవరకు జనరేటరును వినియోగించుకున్న దాఖలాలు లేవు. పలు కార్యాలయాల్లో జనరేటర్లకు కనెక్షన్ కూడా ఇవ్వలేదు. కొన్ని చోట్ల వీటికి భద్రత కరవైంది. విద్యుత్ కోతల సమయంలో పనులు ఆలస్యం కావడంతో ఉన్నతాధికారుల వద్ద చీవాట్లు తప్పని పరిస్థితి నెలకొందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు జనరేటర్లను ఏర్పాటు చేసి వదిలేశారు. యంత్రాల నిర్వహణ, కార్యాలయాలకు అనుసంధాన ప్రక్రియను చేయలేదు. జనరేటర్‌ను బిగించడంతోనే తమ పనై పోయినట్లు వ్యవహరించారు. విద్యుత్ కోతల సమయంలో వీడియో కాన్ఫరెన్సుల్లో పాల్గొనేందుకు తహసీల్దార్లు ఇతర చోట్లకు వెళ్తున్నారు. జనరేటర్ల విషయం గురించి అధికారులు జిల్లా ఉన్నతాధికారుల సమావేశంలో వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని పలువురు అధికారులు వాపోతున్నారు. ఏదేమైనా ప్రజాధనం వృథా కాకుండా ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా మారిన విద్యుత్ జనరేటర్

వినియోగంలోకి తెస్తాం..



జనరేటర్లు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారిన విషయం వాస్తవమే. వినియోగంలోకి తెచ్చేలా తగు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఉన్నతాధికారులకు ఈ విషయంపై వారి దృష్టికి తీసుకెళ్లాం. విద్యుత్ జనరేటర్లు వినియోగంలోకి తెస్తాం.

– వినోద్‌కుమార్, తహసీల్దార్, తొర్రూరు

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



వేలాడుతున్న విద్యుత్ వైరును చూపుతున్న కూలి



పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ సమీపంలోని మున్నేరువాగు పరివాహక ప్రాంతంలో వ్యవసాయ భూముల్లోని విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. గత సంవత్సరం మున్నేరు వాగుకు వరద పొంగడంతో విద్యుత్ స్తంభాలు కూలగా విద్యుత్ వైర్లు తెగి వరదలో కొట్టుకుపోయాయి. విద్యుత్ సిబ్బంది కొన్ని స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు, వైర్లు అమర్చినా కొన్ని ప్రాంతాల్లో కిందికి వాలిన స్తంభాలు, విద్యుత్ వైర్లను పట్టించుకోలేదు. రెండు రోజుల క్రితం సున్నా మల్లికార్జున్‌కు చెందిన వరిపొలంలో కిందికి వాలిన విద్యుత్ వైరును గమనించక వ్యవసాయ కూలి భద్రుకు తగిలింది. ఈ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలు, వైర్లకు మరమ్మతులు చేయాలని రైతులు, కూలీలు కోరుతున్నారు.

విద్యారంగానికి అరకొర నిధులు



మహబూబాబాద్ అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యార్థులను మోసగించిందన్నారు. విద్యారంగంలో 7.31 శాతం తక్కువ నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దు, ప్రకాష్, దినేష్, మహేందర్, అఖిల్, ప్రమోదర్‌పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగానికి 7.3శాతం నిధులను కేటాయింపు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, జిల్లా కన్వీనర్ పట్ల మధు, కన్వీనింగ్ కమిటీ సభ్యులు సూర్యప్రకాశ్, జ్యోతిబసు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట

గూడూరు: బడ్జెట్‌లో రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకన్న, కొమ్మాలు, మధుగౌడ్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పెరుమాండ్ల గుట్టయ్య గౌడ్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశాడు.

గుడుంబా స్థావరాలపై దాడులు

డోర్నకల్: సీరోలు మండలం మోదుగ్గడ్డతండాలోని పలు ఇళ్లు, వ్యవసాయ భూముల్లోని గుడుంబా తయారీ కేంద్రాల్లో డోర్నకల్ పోలీసులు దాడులు నిర్వహించారు. వంద లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 8లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు తెలిపారు.

స్మితా సబర్వాల్‌పై ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్: దివ్యాంగులను కించపరిచిన ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌ను అనర్హురాలిగా ప్రకటించాలని, తక్షణమే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నరేష్, నాగరాజు, సరిత పాల్గొన్నారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

బయ్యారం: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన చిర్ర సాంబయ్య శుక్రవారం తాటిచెట్టు ఎక్కుతున్న సమయంలో మోకుజారడంతో కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తోటి కార్మికులు సాంబయ్యను చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మహబూబాబాద్: కాల్వలో ఆయిల్ బాల్స్ వేస్తున్న మున్సిపల్ కమిషనర్

మహబూబాబాద్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు నందమూరి నగర్ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న, శ్రీనివాస్, ఖలీల్, కిరణ్ పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కురవి: చుట్టు పక్కల ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చింతపల్లి పంచాయతీ కార్యదర్శి రమ్య అన్నారు. సీరోలు మండలం చింతపల్లి గ్రామంలో డ్రైడే సందర్భంగా శుక్రవారం అపరిశుభ్రంగా ప్రదేశంలో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం దార్ల జ్యోతి అంగన్‌వాడీ టీచర్లు రూప, శ్రీదేవి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



మహబూబాబాద్ రూరల్: పర్వతగిరిలో బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

మహబూబాబాద్ రూరల్: ప్రతి ఉపాధ్యాయుడు అంకిత భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు పొందుతారని పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం మందుల శ్రీరాములు అన్నారు. పాఠశాలలో పనిచేసి పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వాణిదేవి, అరుణ, రవీందర్‌ను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నట్టి రవి, చలం, రవికుమార్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, ఉమారాణి, ప్రభాకర్, కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి

కురవి: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ నిర్వహణలో బదిలీ తప్పనిసరి అని పాఠశాల హెచ్ఎం ఎ.రవికుమార్ అన్నారు. మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన రవికుమార్, లింగమూర్తి, జె.వీరన్న, టి.వీరభద్రం, డి.సునీల్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. రూ.6వేల విలువైన సౌండ్ సిస్టంను ఉపాధ్యాయుడు వీరభద్రం స్కూల్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, దామోదర్, మోహన్, బీకు, సురేష్, రవికుమార్, రాజేశ్వరీ, కిషన్, వెంకన్న పాల్గొన్నారు.

బయ్యారం: మండలంలోని కాచనపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బాలాజీ, సమ్మయ్యను, పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ ఆయాను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వామి, ఉపాధ్యాయులు కిషన్, శంకర్, రవీందర్‌నాయక్, బిచ్చానాయక్ పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్: అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్ సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను విద్యా బోధనకు మాత్రమే ఉపయోగించాలని, బోధనేతర పనులకు ఉపయోగించవద్దన్నారు. డీఈఓ నిర్లక్ష్య దోరణి వలనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. డీఈఓ పద్ధతిలో మార్పు రాకుంటే వచ్చే నెల 3న డీఈఓ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నర్సింహారావు, సంజీవ, యాకుబ్ పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



మరిపెడ: జెండాకు వందనం చేస్తున్న ధర్మారావు, తదితరులు



తొర్రూరు: కాగడాలు ప్రదర్శిస్తున్న నాయకులు

మరిపెడ: దేశం కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మరిపెడలోని కార్గిల్ స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, గంగాధర్, లింగం, భాస్కర్ పాల్గొన్నారు.

డోర్నకల్: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని డోర్నకల్‌లో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్‌జైన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం వద్ద అమర సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అశోక్, వీరన్న, నాయకులు నానియాదవ్, అనిల్, యాకయ్య, భద్రునాయక్, ఉపేందర్ పాల్గొన్నారు.

తొర్రూరు: బీజేపీతోనే దేశ రక్షణ సాధ్యమని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్ అన్నారు. కార్గిల్ అమర జవాన్లను స్మరిస్తూ బీజేవైఎం అర్బన్ అధ్యక్షుడు కాగు నవీన్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నుండి వివేకానంద సెంటర్ వరకు కాగడాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ నాయకులు పల్లె కుమార్, రచ్చకుమార్, పైండ్ల రాజేష్, బొచ్చు సురేష్, గడల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: భవన నిర్మాణరంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శంకర్ డిమాండ్ చేశారు. జిల్లా లేబర్ అధికారి కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మంద శంకర్ మాట్లాడుతూ.. కార్మికులకు వివాహ, లేబర్ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ క్లైమ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రసూతి, పెళ్లి కానుకను రూ.లక్షకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గులగట్టు శ్రీను, ఎండి పాష, జలగం ప్రవీణ్, కూరాకుల పాల్, శివ, యాకయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విరిగిన చెట్లను తొలగించిన పోలీసులు

నెల్లికుదురు: ఈదురు గాలులకు నెల్లికుదురు నుంచి తొర్రూరుకు వెళ్లే ప్రధాన రహదారిపై విరిగి పడిన చెట్లను శుక్రవారం ఏఎస్సై యాకయ్య, సిబ్బందితో కలిసి తొలగించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నెల్లికుదురు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలను ప్రతీ ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ బాలరాజు ప్రజలకు సూచించారు. శుక్రవారం నైనాల, కాచికల్, జామ తండా, వావిలాల, కాస్యతండా, సపావత్ తండా, బోటిమీది తండాలో ఎంపీఓ పద్మతో కలిసి సందర్శించి పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

'సాయం చేసేందుకే నీళ్లు కొట్టాడు'

బయ్యారం: మండలంలోని గంధంపల్లి–కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్‌లో విద్యార్థి నీళ్లు కొట్టడంపై సోషల్ మీడియా ద్వారా వైరల్ కావడంతో శుక్రవారం ఎంఈఓ పూల్‌చంద్ పాఠశాలలో విచారణ నిర్వహించారు. స్కావెంజర్‌గా పనిచేస్తున్న మహిళకు సదరు విద్యార్థి వరుసకు మనవడు కావటంతో నానమ్మకు సాయం చేసేందుకు పైపు పట్టుకున్నారన్నారు. విద్యార్థితో టాయిలెట్ కడిగించ లేదని విచారణలో వెల్లడైందన్నారు.

అమ్మవారికి బోనం సమర్పణ

కురవి: మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భద్రకాళీ పండుగ ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ ఏటా భద్రకాళీ అమ్మవారికి బోనం సమర్పిస్తారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు దేవరశెట్టి మల్సూర్, గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకన్న పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

మహబూబాబాద్: కంకర మిల్లు నుంచి వచ్చే కాలుష్యంతో ఆరోగ్య సమస్యలతోపాటు మిల్లుల లారీల డ్రైవర్లు అడ్డగోలుగా నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని తండావాసులు రాజేష్, లింగ్యా, శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామశివారు 8వ వార్డు పరిధిలోని బట్టు తండా వాసులు శుక్రవారం ఆందోళన చేశారు. కార్యక్రమంలో మోహన్, లింగ్యా, తండావాసులు పాల్గొన్నారు.

ఆర్‌సీఓను కలిసిన పేరెంట్స్ కమిటీ

కేసముద్రం: జిల్లా కేంద్రంలో ఆర్‌సీఓ హరిసింగ్‌ను శుక్రవారం కేసముద్రంస్టేషన్‌లోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు చెందిన పేరెంట్స్ కమిటీ చైర్మన్ బొట్టు రమేష్, కమిటీ సభ్యులు రవి, బాలునాయక్, విజయ్, బాలు కలిశారు. హాస్టల్‌లో ఉన్న సమస్యలపై వివరించారు.

5వరకు 'రైతుబీమా'కు గడువు

నెల్లికుదురు: నూతన పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు వచ్చే నెల ఆగస్టు 5 వరకు రైతు బీమా నమోదు చేసుకునేందుకు గడువు ఉందని ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

సమస్యలపై వినతి

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో పలు సమస్యలపై సీపీఎం గ్రామపార్టీ ఆధ్వర్యంలో కార్యదర్శి నాగలక్ష్మీకి శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గొడిశాల వెంకన్న కోరారు. కార్యక్రమంలో జ్యోతి, సుగుణమ్మ, ఎల్లయ్య, మురళీ, కవిత పాల్గొన్నారు.

పాలాభిషేకం

డోర్నకల్: రాష్ట్ర బడ్జెట్‌లో ట్రైబల్ వెల్ఫేర్‌కు భారీగా నిధులు కేటాయించడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు స్థానిక గాంధీ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న నాయకులు భూక్యా తారాచంద్, మాదా శ్రీనివాస్, రెడ్డెబోయిన శంకర్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

డోర్నకల్: దళిత యువకుడిపై దాడి చేసి కులం పేరుతో దూషించిన వ్యక్తి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎల్ విజయకాంత్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తొడేళ్లగూడెం గ్రామానికి చెందిన దళిత యువకుడిపై అదే గ్రామానికి చెందిన తాళ్లూరి శ్రీనివాస్ స్థానిక ప్రభుత్వ కార్యాలయంలో కులం పేరుతో దూషించి దాడి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సమావేశంలో నాయకులు ఐతం ఉపేందర్, కొంద్ర అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

నెల్లికుదురు: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోమనర్సయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, రమేష్, అశ్విన్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన రాచకొండ రాము భార్య నందిని పట్టణంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి గురువారం ఇంటి నుంచి వచ్చింది. ఆమె తమ బంధువుల ఇంటికి రాకపోవటంతోపాటుగా ఆమె ఎక్కడ ఉందనే సమాచారం లభించక కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో నందిని అదృశ్యంపై భర్త రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కుక్కల బెడదను అరికట్టాలి

మహబూబాబాద్: కుక్కల బెడదను అరికట్టేందుకు చర్య తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం కమిషనర్ నోముల రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రాజు, హేమా పాల్గొన్నారు.

ముగ్గురికి పాముకాటు

దంతాలపల్లి: మండలంలోని తూర్పుతండాకు చెందిన బానోత్ మల్సూర్, గున్నెపల్లి గ్రామానికి చెందిన మిడుతపల్లి ప్రమీల, పడమటిగూడేం గ్రామానికి చెందిన అవినేని పద్మ శుక్రవారం పొలం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పాము కాటుకు గురయ్యారు. చికిత్స నిమిత్తం వారిని జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు న్యాయం



తొర్రూరు: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: సీఎంఆర్‌ఎఫ్‌తో పేద ప్రజలకు న్యాయం చేకూరుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానికులకు రూ.11.81లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, మండలాల అధ్యక్షులు సుంచు సంతోష్, రవీందర్‌రెడ్డి, సురేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కురవి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సీఎంఆర్ఎఫ్ పథకం ఒక వరంలాంటిదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. కురవి, సీరోలు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం నల్లెల్ల గ్రామంలో ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీరోలు మండల పార్టీ ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, నాయకులు సుధాకర్, సత్యం, సతీష్ పాల్గొన్నారు.

'వేతనాలు రాకపోవడం ఎవరి తప్పిదమో అర్థం కావడం లేదు'

నెల్లికుదురు: మండలంలోని పార్వతమ్మగూడెం గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికుల వేతనాలు మంజూరు కాకపోవడంపై ఎవరి వల్ల తప్పిదం జరిగిందో అర్థం కావడం లేదని ఎంపీడీఓ బాలరాజు శుక్రవారం అన్నారు. ముగ్గురు మల్టీపర్పస్ కార్మికులకు జూలై 2023 నుంచి జూలై 2024వరకు 12నెల వేతనం ఒక్కొక్కరికి రూ.9,500 ప్రకారం ముగ్గురు కార్మికుల వేతనం రూ.3.42లక్షలు మంజూరు కాక పోవడానికి కారకులు ఎవరనేది ఇంకా తేలలేదని అన్నారు. పార్వతమ్మగూడెం పంచాయతీ కార్యదర్శి వేతనాలు అప్‌లోడ్ చేసే సమయంలో సెలవులో ఉన్నట్లు తెలిపారు. దీంతో ముగ్గురు కార్మికుల సమాచారం కార్యదర్శి ఫోన్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌కు తెలిపారన్నారు. ముగ్గురి కార్మికుల వేతనాలు మంజూరు చేయాలని డీపీఓకు రిక్వెస్ట్ పెట్టినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.